# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## అధికారుల చుట్టూ తిరుగుడు తప్పింది..

రాజంపేట్, నవంబర్ 26: ధరణి కన్నా ముందు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకొని డాక్యుమెంటు తీసుకొని మ్యుటేషన్ కోసం వీఆర్వోలకు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. పాసు పుస్తకం వచ్చేందుకు ఆరు నెలలు, ఏడాది సమయం పట్టేది. పైసలిస్సే గానీ పనయ్యేది కాదు. ఇప్పుడు ధరణి వచ్చిన తర్వాత ఒకే చోట రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తయి గంటలోపే మన పేరున భూమి మారుతుంది. ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగే పనితప్పింది.

**- బోయిని గంగయ్య, రైతు, తలమడ్ల**



## ధరణితోనే మా భూములు మాకు తెలిసినయ్..

రాజంపేట్, నవంబర్ 26: గతంలో మాకు మా భూములపై సరైన అవగాహన లేకుండె. పట్వారీలు, వీఆర్వోలు ఏది చెప్తే అదే నమ్మేవాళ్లం. మేము గతంలో కొనుగోలు చేసిన భూమి పాత పాసు పుస్తకంలో సర్వే నంబర్ రాశారు కానీ అది పహాణీలోకి మార్చలేదు. దీంతో ధరణిలో ఆ భూమి రాలేదు. ఎందుకని ఆరా తీయగా పహాణీలో అమ్మిన వారి పేరే ఉండడంతో అది రాలేదని గుర్తించి దాని సరిచేసుకున్నాం. అప్పటి వరకు పాసు పుస్తకంలో ఉన్నదే నిజమని నమ్మినం. కానీ పట్వారీలు, వీఆర్‌వోల వ్యవస్థలో ఇలాంటి తప్పులు చాలా ఉన్నాయని గుర్తించాం. అప్పటి నుంచి మా భూములు ఏఏ సర్వే నంబర్ ఎక్కడ ఉందో పూర్తిగా అవగాహన వచ్చింది. ఇప్పుడు కొనుగోలు చేసిన వెంటనే అమ్మినవాళ్ల పేరు తీసేసి.. మా పేరున మారుతుంది. ఇది చాలా బాగున్నది. ధరణి రైతులకు చాలా మేలు చేస్తున్నది. దళారీల మోసానికి తావు లేదు. రైతులు భూములు భద్రంగా ఉంటాయి. ధరణి తెచ్చిన కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

-మర్రి సాయిరెడ్డి, రైతు, బస్వన్నపల్లి

## ధరణితో సులువుగా పనులు..

రాజంపేట్, నవంబర్ 26: మా అమ్మ చనిపోయిన తర్వాత ఆమె పేరుపైన ఉన్న భూమిని మార్చుకోవడానికి గతంలో మాదిరి పైసలు ఇవ్వాల్సి వస్తుందోమోనని భయపడ్డాం.ఎక్కువ సమయం పడుతుందేమోనని అనుకున్నాం. కానీ వారం, పది రోజుల్లోనే మా ఇంటికి పాసు పుస్తకం వచ్చింది. ధరణితో పనులు చాలా వేగవంతంగా, సులువు జరుగుతున్నాయి. ధరణి బాగున్నది. దీనినే కొనసాగించాలి. ధరణి తీసేస్తామంటున్న కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో మేం లేం.

**-కావేటి కిష్టయ్య, రైతు, బస్వన్నపల్లి**

# ధరణిని తొలగిస్తామన్న హస్తం.. మసిచేస్తం

- రైతులతో పెట్టుకున్నోడు నాశనమే..
- పాత పద్ధతి తెస్తామంటున్న కాంగ్రెసోళ్లకు వాత పెడ్తాం
- రైతుభరోసాపై మాట మార్చిన టీపీసీసీ చీఫ్‌పై మండిపాటు
- ధరణితోనే భూ పంచాయితీల పీడ విరగడైంది..
- కేసీఆర్ ఉంటేనే మా భూములకు భద్రత.. భరోసా

## ధరణిని తొలగిస్తే ఊరుకోం..

రాజంపేట్, నవంబర్ 26: ధరణి పోర్టల్ ఏర్పాటుతో భూముల అమ్మకాలు, కొనుగోలు, మార్పిడి సులువుగా అవుతున్నాయి. గతంలో కాంగ్రెసోళ్ల పాలనలో భూముల రిజిస్ట్రేషన్ ఎంతో పెద్ద కథ. రిస్క్ ఉంటుండె. మధ్యవర్తులు ఉంటేనే పని జరుగేది. కానీ సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత ధరణి పోర్టల్ ద్వారా ఎవరి అవసరమూ లేకుండా స్లాట్ బుక్ చేసుకొని తహసీల్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. గంటలో పనిమొత్తం అయిపోయింది. పట్టా చేతికి వచ్చింది. ఇంత మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కే మద్దతుగా ఉంటాం. ధరణిని తొలగిస్తామంటున్న కాంగ్రెస్‌ను నమ్మం.

**-బాణాల సందీప్ రెడ్డి, రైతు, బస్వన్నపల్లి**





## కాంగ్రెస్ వస్తే రైతులకు పాత రోజులే..

గతంలో యజమానుల పేర్లు మార్చాలంటే దళారులను పట్టుకొని అధికారుల చుట్టూ తిరిగి డబ్బులు పెట్టుకొని పనులు చేసుకునేవాళ్లం. ఇప్పుడు ధరణి రాకతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని తహసీల్ ఆఫీస్‌కు పోతే నిమిషాల్లో దళారులు లేకుండానే పనులు పూర్తి చేసుకొని వస్తున్నాం. కాంగ్రెసోళ్లు మళ్లీ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తాం అంటున్నారు. వాళ్లు అధికారంలోకి వస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. కాంగ్రెసోళ్లకు రైతులను వేధించడం తప్ప మరొకటి రాదు.

**- బసవయ్య, రైతు, భిక్కనూరు**





## ధరణి పోతే అధోగతే..

భిక్కనూర్, నవంబర్ 26: ధరణి పోర్టల్‌తో రైతులు కంటినిండా నిద్రపోతున్నారు. అదే తీసేస్తే పైరవీకారులు రాజ్యమేలుతారు. పట్వారీల వ్యవస్థలో క్షణాల్లో పహాణీలో పట్టాదారు పేరు దొంగతనంగా మార్చేది. రైతులు చెప్పులు అరిగేలా తిరిగినా పనులు కాకపోయేది. ధరణితో దళారుల లంచాలకు చెక్ పడింది. ధరణిని కాంగ్రెసోళ్లు బంగాళాఖాతంలో వేస్తామనడం అవివేకం. దాన్ని తీసివేస్తే రెవెన్యూ వ్యవస్థ ఆగమైతది. రైతుల భూములకు రెక్కలొస్తాయి. పట్టాదారుకు తెల్వకుండానే అతని భూమి మార్పిడి జరుగుతుంది. ధరణిలోరిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగిన తక్షణమే అమ్మిన వారి పేరు వెళ్లిపోయి.. కొన్నవారి పేరు మీదకు భూమి నమోదైతుంది. ధరణిని మార్చితే రైతులు నెలకోసారి మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తుంది. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో భూ రికార్డుల్లో అవకతవకలు లేకుండా అయ్యింది.

**- చెన్నప్పగారి ప్రభాకర్ రెడ్డి, జంగంపల్లి, భిక్కనూరు మండలం**



## కాంగ్రెస్ వస్తే దొంగ రిజిస్ట్రేషన్లు మొదలవుతాయి..

సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చి మా భూములకు భద్రత కల్పించారు. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థతో దొంగ రిజిస్ట్రేషన్లు చేశారు. రికార్డులను గోల్‌మాల్ చేసి రైతులను మోసం చేసేవారు. రోజుల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవికావు. ధరణి వచ్చిన తర్వాత రూపాయి లంచం లేకుండా సమయం వృథా కాకుండా పనులు అవుతున్నాయి. కాంగ్రెస్ మాటలు నమ్మితే మనల్ని నట్టేట ముంచుతారు.

**- భిక్షపతి, రైతు, బస్వాపూర్, భిక్కనూరు మండలం**